



# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి
99893 71284

**జరిగిన కథ:** ఒకనాటి ప్రత్యూషవేళ.. వ్యాయామశాలకు వెళ్లాడు జాయపుడు. ఆశ్చర్యం! అక్కడ గణపతిదేవుడు మరొకరితో కుస్తీపట్లు పోటాపోటీగా పడుతున్నాడు. ఆ వ్యక్తికున్న కేశాలంకరణ వల్ల మహిళ అని తెలుస్తోంది. దగ్గరికి వెళితే అబ్బురంగా.. అతడు.. కాదుకాదు ఆమె! రుద్రమదేవి!! కూతురి యుద్ధవిద్యా ప్రావీణ్యం చూసి.. ఆమె గురించి కొండంత తృప్తితో చెప్పాడు గణపతిదేవుడు. జాయచోడుడు విభ్రమంగా చూస్తున్నాడామెను.. కాకతీయ సామ్రాజ్య భవిష్యత్ స్వరూపాన్ని!!

ఎంత హాయిగా ఉంది! పదహారేళ్ల అచ్చమైన పదహారణాల ఆడపిల్ల.. స్నిగ్ధ గంభీరం!!

పకపకా నవ్వింది.. అప్పుడే విచ్చుకున్న కాకతీయ నవపారిజతం!.. వసంత మనోజ్ఞం!!

అదే మగాడి దుస్తుల్లో మగాడిగా పరిచయం చేస్తే వికారంగా ఉంది. జాయచోడుని మనసు సంతోషంతో పరిమళించింది. మహిళ వ్యాయామ దుస్తుల్లో తండ్రితో తలపడి.. అలవోకగా ఆకాశానికి కాలెత్తి ధైర్యంగా విసురుతున్న రుద్రమదేవి! తండ్రిని పట్టి కదలకుండా బంధించి విసిరేసిన లాఘవం.. బరిసెను పట్టి ఎత్తిన తీరు.. ఖడ్గాన్ని తిప్పి పరీక్షించిన అవగాహన.. ఓహో.. అద్భుతం! తప్పకుండా మహా యుద్ధయోధ!!

ఆమెనే చూస్తున్నారు ఇద్దరూ.. తండ్రి, మేనమామ. పులకింతగా!

'ప్రజలు కూడా ఆమెను బుద్ధిమంతురాలైన యువతిగా, గణపాంబలాగే మంచి కాకతీయ ఆడపడచుగా చూస్తున్నారు'.. అని శుక్ర చెప్పాడు. సందేహంలేదు పుట్టినింటికి, మెట్టినింటికీ గొప్ప పేరుప్రఖ్యాతులు తేగలదు. తథ్యం. ఇది తథ్యం!

''మామా!''

మురిసిపోయాడు.

''రుద్రమా.. హబ్బ! ఎంత హాయిగా ఉన్నావూ.. ఆ మగ దుస్తుల్లో ఎంత క్లేశం అనుభవించావో కదా!''

పకపకా నవ్వింది.. అప్పుడే విచ్చుకున్న యువ యుద్ధ మందారం!!

''మామా.. యుద్ధవిద్యల్లో మీ ప్రావీణ్యం అద్భుతమట. యుద్ధరంగంలో మీ యుక్తులు, తంత్రాలు అమోఘమట. ఘడియఘడియకూ వ్యూహం మార్చి లిప్తకాలంలో శత్రువు శిరస్సును తెంచి కందుకక్రీడ ఆడగలరట. తండ్రిగారికి మీరు ఖడ్గం అందించినప్పటి గగుర్పాటు ఆయన నాకు రోజూ చెబుతూనే ఉన్నారు. ఇక యుద్ధ జంతువులకు మీ శిక్షణ అద్భుతమని దక్షిణావర్తంలోని రాజులందరూ చెప్పుకొంటారట..''

ఆమె మాటలను తండ్రి ఆస్వాదిస్తుండగా మధ్యలో అడ్డుపడ్డాడు జాయచోడుడు.

''ఆ.. ఆపాపు! నా శిక్షణాపటిమ కేవలం జంతువుల మీదే..''

ముగ్గురూ ఘొల్లున నవ్వారు.

''చిన్నతల్లీ!!''

''ఆ..''

''హమ్మయ్య.. పలికావు! నేను గణపాంబను 'పెద్ద తల్లి' అని పిలుస్తాను. అందుచేత నువ్వు చిన్నతల్లివి అన్నమాట..''

''ఉన్నమాటేగా మామా! తండ్రిగారి తర్వాత మీరే నాకు ఆరాధ్యులు!!''

జాయచోడుడు పులకించకుండా ఉంటాడా..?! గణపతిదేవుడు మురిసిపోవడంలో ఆశ్చర్యం ఏముంది!??

అయితే రుద్రమదేవి గురించిన ప్రకటన ప్రజల్లో కలి